పత్రికా ప్రకటన తేది:31.12.2018.

# ఏడాదిలో మీడియా అకాడమీ భవనం

## - జర్నలిజం కోర్సు . . .

మీడియా అకాడమీకి మంజూరైన భవన నిర్మాణం జరుగుతున్నదని, అకాడమీ భవనాన్ని కూల్చివేసి కొత్త భవన నిర్మాణం కోసం ఆర్.అండ్.బీ. ఆధ్వర్యంలో టెండర్లు ఖరారయ్యాయని అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. పాత భవనం కూల్చివేత పూర్తయిందని త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ సమయం, అనుమతి తీసుకుని కొత్త భవనానికి శంకుస్థాపన జరుపుతామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధవహించి అకాడమి భవనానికి 15 కోట్ల రూపాయలు మంజూరు చేశామని ఆయన చెప్పారు. నూతన అకాడమీ భవనం పూర్తయితే, వంద కోట్ల నిధి నుండి భవనంలో శాశ్వత తరగతి గదులు ఏర్పాటు చేసి ఒక జర్నలిజం కోర్సును కూడా ప్రారంభించాల్సి ఉన్నదని ఆయన వెల్లడించారు. త్వరలో భవనం పూర్తవుతుందని, అలానే హామీ ఇచ్చిన మేరకు జర్నలిస్టుల సంక్షేమ నిధిని వంద కోట్ల ఫండ్ కూడా ఇస్తామని ముఖ్యమంత్రి ఇటీవల చెప్పారని అందువల్ల సంవత్సర కాలంలో భవన నిర్మాణం, జర్నలిజం కోర్సు రూపొందిస్తామని అల్లం నారాయణ అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

సోమవారంనాడు సమాచార భవన్‌లోని బోర్డు రూమ్‌లోతెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ అధ్యక్షతన పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ పాలకమండలి సమావేశంలో మరో 47 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర అనారోగ్యం బారిన పడిన 16 మంది వర్కింగ్ జర్నలిస్టులకు ఆర్థిక సహాయం చేయడానికి కమిటీ సభ్యులు సమావేశంలో ఆమోదం తెలిపారు. మీడియా అకాడమీ నూతన భవన నిర్మాణం, శిక్షణా తరగతుల నిర్వహణ వంటి అంశాలపై కమిటీ సుదీర్ఘంగా చర్చించింది.

ఈ సమావేశంలో చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమ నిధికి రాష్ట్ర ప్రభుత్వం 100 కోట్లు ప్రకటించి ఇప్పటి వరకు 34 కోట్ల 50 లక్షల రూపాయలను విడుదల చేసిందని ఆయన వివరించారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి ఇప్పటి వరకు 150 మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున ఒక కోటి యాభై లక్షల ఆర్థిక సహాయం అందజేశామని తెలిపారు. ఈ కుటుంబాలకు ప్రతి నెల పెన్షన్ రూ.3,000/-లతో 5 సంవత్సరాల వరకు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అంతేగాక మరణించిన జర్నలిస్టుల పిల్లలు ఒకటి నుండి 10వ తరగతి వరకు విద్యను అభ్యసించే 104 మంది విద్యార్థులకు ట్యూషన్ ఫీజుగా రూ.1000/-ల చొప్పున చెల్లిస్తున్నామని ఆయన తెలిపారు. తీవ్ర అనారోగ్యం బారిన పడిన 52 మంది జర్నలిస్టులకు రూ.50,000/-ల చొప్పున 26 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేసినట్లు వివరించారు.

(Contd...2..page)

ఇప్పటి వరకు 9 ఉమ్మడి జిల్లాలలో జర్నలిస్టుల శిక్షణా తరగతులను విజయవంతంగా పూర్తి చేశామని, ఈ శిక్షణా తరగతులలో దాదాపు 5361 మంది జర్నలిస్టులు హాజరై తమ శిక్షణను సద్వినియోగ పర్చుకున్నారని తెలిపారు. ఈ శిక్షణా తరగతులలో మీడియా అకాడమి రూపొందించిన 9 అంశాలతో పుస్తకాలను ప్రచురించి జర్నలిస్టులకు అందజేశామని వివరించారు.

తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టు సమాజానికి ఎనలేని ఖ్యాతి తీసుకువచ్చిన ప్రముఖ జర్నలిస్టుల మెనో గ్రాఫ్స్ రూపంలో భద్రపర్చడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ భాషా మాండలికాలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో క్రమ క్రమంగా వాడకం పెరుగుతున్న దృష్ట్యా వీటిని మరింతగా పెంచేందుకు ప్రత్యేక సెమినార్లు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. విలేకరులకు నాణ్యమైన శిక్షణ అందించడంతోపాటు కంప్యూటర్ శిక్షణను సైతం ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని కమిటీ సభ్యులు సూచించారు. సోషల్ మీడియా, డాటా బ్యాంకింగ్, ఫీచర్ జర్నలిజం వంటి అంశాలపై కూడా దృష్టిసారించాలని సభ్యులు కోరారు.

ఈ సమావేశానికి హజరైన సభ్యులు పలు విలువైన సూచనలు సలహాలు అందజేసినారు.

ఈ సమావేశంలో సభ్యులు బుద్దపూర్ణిమ ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్, నమస్తే తెలంగాణ ఎడిటర్ కట్టా శేఖర్‌రెడ్డి, డెక్కన్ క్రానికల్ పొలిటికల్ ఎడిటర్ గౌరీ శంకర్, సీనియర్ సంపాదకులు టంకశాల అశోక్, తెలుగు విశ్వవిద్యాలయ జర్నలిజం శాఖాధిపతి సత్తిరెడ్డి, ఆలిండియో రేడియా డైరెక్టర్ ఉదయ్ శంకర్, సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు నాగయ్య కాంబ్లె, చీఫ్ ఇంజనీర్ కిశోర్ బాబు, కార్యదర్శి రాజమౌళి, మేనేజర్ జి. లక్ష్మణ్ కుమార్, అకౌంట్స్ ఆఫీసర్ కె. యాదగిరి, సిబ్బంది వనజ, ప్రసాద్ , ఎమ్.కె. రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

---

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ, హైదరాబాద్.